రోగం మీద, నేను ప్రతి శాపం ఇస్తున్నాను. ముందు ముందు ఈ దిబ్బమీదకొచ్చే ప్రతి పెద్ద అధికారి తన కింద వాళ్ళచేత 'నీ శ్రాద్ధం పెట్ట' అనిపించుకొని తీరుకాక! ఆ శపించిన వాడు మరణించిన తర్వాత వాడిచేత శ్రాద్ధం పెట్టించు కోకుండానే ఆ అధికారి అతి ఆవేదనతో మరణించుగాక! నాది గురుశిష్యుల సంబంధం కనుక, నాశాపం -దిబ్బమీద వెలిసే విద్యాలయానికి మాత్రమే వర్తించుగాక! తథాస్తు! .. హ్రాం, హ్రీం.. హ్రూం ఫట్ -ఇట్లు భగభగ ముని' ...ఇదంతే బాబూ ఈ రేకు మీద రాత!... యములోరూ ఈ నడుం నెప్పి కాస్తంత సర్దుకున్నాక యింకా లోతుకి తవ్వియింకా యామయినా కనిపిస్తాయేమో సూస్తాను, సెలవిప్పిచ్చండి దొరా!"

" వీల్లేదు! అవతల నాకోసం జనం క్యూలో నిలబడున్నారు. అసలు నువ్వు ముందు నాతో పచ్చెయ్. అక్కడే ఆయనకి హామీ ఇద్దువుగానీ!... ఇదిగో విసుర్తున్నా పగ్గం!"

" ఏందయ్యోయ్ తలారిస్వామీ...! నేను అసలే అతి బిజీలో ఉన్నాను. పగ్గంగాని దించక పొయ్యావంటే నీశ్రాద్ధం పెట్ట అని శపించేత్తాను. నీ కన్నా ముందర నేను సచ్చిపోతాను గదా! అప్పుడు నీ గతేమవుద్దో ఆలోసించుకో. ఇప్పుడిక్కడ నేను గవర్మెంటోణ్ణి నీకన్నా పెద్దోణ్ణి. అదీ యిసయం... ఆ పగ్గందించేసి పారిపోకయ్యా! నడిచెల్లు పర్లేదు... అవునయితే నేను యములోర్నే దడిపించేసానేంటబ్బాః... అంటే యముణ్ణి గూడా ఈ దిబ్బమీద నుంచున్నావోడు తన్ని తగిలేత్తాడన్నమాట! భలే దిబ్బ! కృష్ణ కాలవగట్టు మీదున్న హైస్కూలు కోటదిబ్బ!"

(క్రోక్విల్ హాస్యప్రియ ఆగస్టు- సెప్టెంబరు '85)

★★★ ★★★ ★★★

# వొదిలేస్తావా?... నిజంగా?

## శనివారం రాత్రివేళ.

భార్యాభర్త లిద్దరూ ఇడ్లీ తింటున్నారు. సుందరికి పలక మారింది. తలెత్తి పైకి చూసి అరచేత్తో నెత్తి కొట్టుకొంది. " ఎవరో నన్ను తలుచుకుంటున్నట్టున్నారు, ప్రేమగా" అంది గోముగా.

" మరే, మరే, ఇంకెవరున్నారు నేనే!... అసలు నేను నిన్నెప్పుడూ తలుచుకుంటూనే ఉంటాను, చిట్టి! నా మనస్సులో ఎక్కడో మూల నువ్వెప్పుడూ ఆడుతూనే ఉంటావు తెలుసా? " అన్నాడు భర్త రాగనిధి. .. కనుబొమ్మలు ముడిచి సుందరి అంది, " ఏంటీ, ఎక్కడో మూలా? మనస్సు నిండా ఉండనన్న మాట!" నవ్వాడు రాగనిధి. " మనస్సు నిండా నువ్వే ఉంటే ఉద్యోగమెట్లా చేస్తాను? కంచంలోకి కూడెట్లా వస్తుంది?"

ఆమె మూతిని మూడు వంకర్లు తిప్పింది. 'హు' అంది... కాస్సేపటికి ఆమె అడిగింది " మజ్జిగివ్వనా?" ... " కాదు. పాలు" టక్కున సమాధానం.

ఆమె అలమార్లోంచి పాలు తెస్తూ " ఏం చూసుకునో ఆ ఫోర్సు! ఆ మాత్రం వూపు ఇతర్లక్కూడా ఉంటుందనుకోవాలి."

రాగనిధి తలెత్తి చూశాడు. సుందరి అతని కంచంలో పాలు పోసింది. పంచదార కూడా వేసింది

కాస్సేపటికి కంచంలో పాలు అయిపోయాయి అతను " పాలు" అన్నాడు ఆమె పాలు పోసింది ఈసారి పాలు మిగిలాయి అతను 'ఇడ్డెన్లు' అన్నాడు ఆమె రెండు ఇడ్డెన్లు వేసింది ఈ మాటు ఇడ్డెను మిగిలింది ఆమె మళ్ళీ పాలు పోసింది మళ్ళీ పాలు మిగిలాయి అతను మళ్ళీ 'ఇడ్డెను' అన్నాడు "వేస్తాను- పారెయ్యనంటే కానీ మళ్ళీ పాలు అనకండి అసలే తోడుకు తక్కువగా ఉన్నాయి." ఆమె ఇంకో ఇడ్డెను వేసింది. అతను నవ్వాడు. రెండు నిముషాల తర్వాత- 'ఎక్కువైంది' అంటూ అర ఇడ్డెను కంచంలో వదిలేసి అందులోనే చెయ్యి కడిగేసుకున్నాడు

సుందరి చటుక్కున బుగ్గలు నొక్కుకుంటూ అంది- "నేననుకుంటూనే ఉన్నాను మీ మందబుద్ధి పోనివ్వరని ! ... అసలు నాయుడూ మాట - బజార్లో ఇడ్డెను ఖరీదెంత?" కూర్చునే మూతి తుడుచు కుంటూ అన్నాడు రాగనిధి- " హైదరాబాద్‌లో రూపాయి వసంత మహల్లో అయితే అర్ధరూపాయి "

'సర్లే మనూర్లోనే తీసుకుందాం. ఆ లెక్కన ఇరవై నాలుగిడ్లీలు పన్నెండు రూపాయలు- అవునా? మరి నేను ఖర్చు పెట్టిందెంతో తెలుసా? పిండికీ, రవ్వకీ కలిపి రెండు. కొబ్బరి పచ్చడికి రెండు. గాస్‌కి అర్ధరూపాయి. ఇన్సిడెంటల్ చార్జెస్ కింద ఒకటి వెరసి ఆరు ఇది మెటీరియల్ ఖరీదు పన్నెండులో ఈ ఆరూ పోగా మిగిలిన ఆరూ నా లేబర్ చార్జి కింద కొస్తాయన్నమాట!"

రాగనిధి నవ్వాడు. " నీకు లేబరేమిటి? ఇది గ్రైండర్‌లో రుబ్బావు కుక్కర్‌లో వండావు లేబరా? ఈ మాటలు చెవులో పువ్వు పెట్టుకున్న వాడి కెవడికైనా చెప్పు వింటాడు "

" వోయినాని పండూ ! గ్రైండర్‌లో పొయ్యగానే కరెంటు పోయింది రోట్లో పోసి రుబ్బేటప్పటికి చచ్చీ చెడి చేయంగల విన్నపాలైంది... అసలా పనయినా వూరికే ఎవత్తె చేస్తుందో చూపించండి:" రాగనిధి హఠాత్తుగా ముందుకు వంగి అన్నాడు" తెమ్మంటావా?"

ఆమె చురుగ్గా చూసింది. " తేవటమా, ఎవర్ని? మాటలు తిన్నగా రావేమిటి? ఇరవై నాలుగిడ్డెనలకీ ఆరు రూపాయలైతే ఇడ్డెను ఒక్కింటికి లేబరు పావలా. అంటే అర ఇడ్డెనుకీ బేడా లేక పన్నెండున్నర పైసలు. నువ్విప్పుడు ముక్క పారెయ్యటం వల్ల నా సొమ్ము నువ్వు తినకపోతివి, నన్ను తిననివ్వకపోతివి. ముష్టాడిక్కూడా ఉపయోగించకుండా నీళ్ళు పోసేస్తివి. నీ దుర్బుద్ధి కాలిపోను!"

రాగనిధి వెలాతెలాపోతా చూశాడు. " బాధపడకు, అండాళ్లూ! నీ డబ్బు పోయిందనేగా నీబాధ. ఆ పన్నెండున్నర పైసలే ఏం ఖర్మ. మొత్తంగా నీ కూలీ ఆరు రూపాయలూ ఇచ్చేస్తాన్లే." చటుక్కున చెయ్యి చాపుతూ అంది సుందరి " అయితే ఇవ్వండి "

" ఇప్పుడెక్కడ్నుంచొస్తుంది? రేప్పొద్దున బాంకు కెళ్ళొచ్చిస్తాన్లే".. " సరే ఇంక నువ్విచ్చినట్టే నేను పుచ్చుకున్నట్టే!" ఆమె మెటికలు విరిచింది

అతను పౌరుషంగా అన్నాడు " వూరికే అమ్మమ్మ లాగా దెప్పకు అసలిప్పుడు ఇచ్చెయ్యగల్ను తెల్సా? కానీ నా జేబులో ఉన్నది వందనోటు " . " ఒహో! ఫర్వాలేదు, ఇవ్వండి చిల్లరుంది ఇస్తాను " . " నీ సొమ్ము నీ దగ్గరుండటంలో తప్పులేదు, అప్పీల్లేదు కానీ మిగిలింది నాకిస్తావని నమ్మకమేంటి?" " ఇవ్వకేం చేస్తాను?" " అట్నుంచి అటే చీరల కొట్టు కెళ్లిపోవచ్చు. లేకపోతే పుట్టింటి కెళ్ళిపోవచ్చు " నవ్వుతూ అన్నాడు రాగనిధి.

సుందరి కళ్ళెర్ర చేసింది కోపంగా అంది " మళ్ళీ పుట్టింటి మాటెత్తావా! ఏమిటి, ఒళ్ళు ఎలాగుందేమిటి?" " అప్పుడే కోపం వచ్చేసిందా?" తికమకగా అన్నాడు రాగనిధి

" అప్పుడే ఏమిటి - ఇట్లాంటప్పుడు మాత్రమే రావాలని రూలుందా?" ... "సరే వచ్చింది. ఏం

చేస్తావ్?'' ... '' ఏంచేస్తానా .. ఒదిలేస్తాను.. నిన్నొదిలేసి లేచి చక్కా పోతాను. పెట్టుబడి నష్టం నాకు రూపాయి లేదు. జాగ్రత్త!'' ఎర్రబడ్డ మొహంతో ఆమె కంచాలు పోగు చేసి తీసుకెళ్ళి తూము దగ్గర పడేసింది.

రాగనిధి నోరు తెరిచింది తెరిచినట్టే ఉండిపోయింది. క్రమంగా అతని మొహంలో విషాదం అలుముకుంది. కొన్ని క్షణాల తర్వాత తేరుకుని హీన స్వరంతో అతనన్నాడు - '' అంతమాటనకు, సుందూ, నువ్వెన్నన్నా భరిస్తాను. కానీ, ఆ మాట మాత్రం భరించలేను. ప్లీజ్, ప్లీజ్.. ఆ మాట వూరికే అన్నానని చెప్పు. ఇంకెప్పుడూ అనని చెప్పు.'' అతను పీట మీద నుంచి లేచాడు. ఆమె వెనకాలకొచ్చాడు.

సుందరి మొహంలో కోపం తగ్గింది. '' అయితే నాకెప్పుడూ కోపం తెప్పించనని చెప్పండి.''

'' ఇప్పుడు కోపం తెచ్చుకున్నది నువ్వు.. సరే తెప్పించన్లే.''.. '' సరే! నిన్నొదల్నులే.''

★ ★ ★

ఆదివారం తెల్లారింది.

వంటింట్లో సుందరి కాఫీ కాస్తూంది. దొడ్లో రాగనిధి బ్రష్‌ను నమిలేస్తున్నాడు. సుందరి కూనిరాగం ఎత్తుకుంది

'' వలపు ఏమిటి ఏమిటి ఏమిటి
కాఫీలో కలిసిన దేమిటి ఏమిటి
ప్రేమపు పాలివికావా ఏమిటి
ఎప్పుడు వచ్చునో మురిపెపు పెనిమిటి...''

అర్జంటుగా ఆఖరుసారిగా నీళ్లు పుక్కిలించి ఉమ్మేసి, '' వోయ్ వోయ్! నన్నేనా... వస్తున్నా వస్తున్నా!'' అంటూ రాగనిధి దొడ్లోంచి ఒక్క అంగలో వంటింట్లోకి దూకేశాడు నవ్వుతూ. '' ఎంత ముద్దుగా పాడుతున్నావ్ డాళింగ్! వూ, కానీ, అయినా నన్ను పిలవటానికి పాట పాడాలా, అమ్మడూ!'' అన్నాడు.

సుందరికోపం నటించింది. ''చాల్లెండి ఇకిలింపూ, మీరూను! మిమ్మల్నెవరు పిలిచారు!'' రాగనిధి చిన్నబుచ్చుకున్నాడు. '' ఏమో ప్రేమగా పిలిచావేమో ననుకున్నాను.''

'' ఆఁ, రాత్రీ, పగలూ ప్రేమిస్తూ స్తూ స్తూండటమే పని!.. ఉ ఉ, ఈ కాఫీ తీసుకొండి.''

అతను బిక్క మొహంతో కాఫీ గ్లాసు అందుకున్నాడు. మెల్లిగా వాకిలిగదిలోకి కదిలాడు. పావుగంట గడిచింది. ఆమె మధ్య గదిలోకొచ్చి చీపురుతో అందినంత వరకూ గోడల మీది బూజును దులుపుతోంది. మళ్లీ పాట అందుకొంది.

'' ఇంద్రూడావని యెంచి చంద్రూడా వని యెంచి నీతోటి కాపురమూ బహు సూఖామని యెంచి లల్లాల లలలల్లా లాలల్లా లలల్లా!''

పాట ఆపి ఆమె వాకిటి గదిలోకి తొంగి చూసింది. రాగనిధి పడక్కుర్చీలో పేపరు చదువుకుంటున్న వాడల్లా . దాన్ని మడిచి, పక్కకి ఒరిగి భార్యవైపే గోముగా చూస్తున్నాడు.

దులపటం ఆపి సుందరి భర్తవైపు చూసి నవ్వింది. ముక్కు చిట్లించి తల ఆడించింది. మళ్ళీ దులపటం మొదలు పెట్టి పాట అందుకుంది

'' ఇంద్రూడ వని యెంచి చంద్రూడావని యెంచి నీతోటి కాపురమూ బహూ సూఖామని యెంచి మోజుమీరా ప్రేమించి నీచేతా వలపించి మనసారగా రమించి తనివితీరా మోహించి మందితో పొగిడించి

గుండెలో నింపుకొని నిలోన నెన్నుండి నీతోటి ననుండ దీవించు పైనించి నన్నెప్పుడూ విరించి(బ్రహ్మ) అంచేత నా మగడ రావయ్యా వేవేగ చీపిరి స్వీకరించి దులుపుము ఈ బూజును"

పాట ఆపి ఆమె భర్త వైపు చూసింది ఎప్పుడో తల తిప్పేసుకుని అతను సీరియస్‌గా పేపర్లో నిర్యాణం ఫొటోలో ముసలాణ్ణి పరిశీలిస్తున్నాడు

సుందరి ఆఖరి నాలుగు చరణాల్నీ మళ్ళీ పాడింది మళ్ళీ పాడింది మళ్ళీమళ్ళీపాడింది అతను కదల్లేదు కనీసం తొంగి కూడా చూళ్ళేదు.

ఆమె చీపిరి అక్కడే పడేసి విసురుగా వాకిలి గదిలోకొచ్చింది టేబిల్ మీదున్న టేప్ రికార్డరును ఎత్తి పెట్టింది గొణిగింది "పిలిస్తే వినిపించుకోడు కాబోలమ్మా! అంత చెటు వినికిడి సమస్యొచ్చేసిందేమిటో అప్పుడే "

అతనిలో చలనం లేదు

" ఇంటెడు చాకరీ చేసుకోలేక ఛస్తున్నానా? సింపతీ లేదు సరికదా, పిలవగానే పలకాలని కూడా లేదు హు " సుందరి వెనక్కి తిరిగి మొగుడివైపు కెళ్లింది భళ్ళున అలమర తెరచి రెండు పుస్తకాలు కింద పడేసింది మడత కుర్చీ తెరిచి ఫట్ ఫట్‌మని శబ్దమయ్యేలాగా వెంటనే ముడిచేసింది. పౌడర్ డబ్బా ఎత్తి కింద పడేసింది గుమ్మం లోంచి తొంగి చూసింది.

రాగనిధిలో మార్పులేదు

సుందరి దూకుడుగా భర్త పక్కకొచ్చినుంచుంది అంది- " ఇదిగో నిన్నే! చెవుల్లో చెట్లు మొలిచాయా అని అడుగుతున్నాను సీసం కరిగించి పోసుకున్నావా అని అడుగుతున్నాను పిలిస్తే పలక్కపోవటానికీ నీకేం రోగం వచ్చిందని అడుగుతున్నాను "

రాగనిధి పక్కకి తిరిగి చూశాడు అన్నాడు- " ఏమిటోయ్, పిలిచావా?"

వెటకారంగా సుందరి అంది - " అబ్బే పిలవలా! పలక్క పోగా తిరుగు టపాలో ప్రశ్నొకటి మొహానికి!"

అతను పేపరు కింద పడేసి కుర్చీలోంచి లేచాడు. అన్నాడు- "ఇందాక ముద్దుగా పిలిచావని బుద్ధిగా పలికితే కాదు పొమ్మని కసిరావు. ఇప్పుడు పిలవకుండానే పిలిచాను రమ్మని కసుర్తున్నావు.. ఎట్లాగే నీతోటి?"

కోపం తగ్గింది సుందరి మొహంలో. " ఇందాక సినిమా పాట పాడుతున్నాను.ఇప్పుడు సొంత పాట పాడుతున్నాను ". " పాట ఏదయినా పిలుపు పిలుపేగా!"... " ఏమిటీ! సినిమా పాటకీ, సొంత పాటకీ తేడా లేదా? సినిమా మొగుడికీ, సొంత మొగుడికీ డిఫరెన్సు లేదా?"

రాగనిధి ఆశ్చర్యంగా చూశాడు " సినిమా మొగుడా? అంటే నీకు సినిమా మొగుడూ, సొంత మొగుడూ అని ఇద్దరున్నారన్నమాట!"

" నోటికొచ్చినట్టు వాగకు! సినిమాలో హీరోయిన్ మొగుడు అడ్డమైన అప్రాచ్యప్పన్లూ చేసి అమాంతం వాటేసుకుంటాడు అదే పరమార్థం అయినట్టు సొంత మొగుడు అలాక్కాదే. అతి సున్నితంగా అద్భుత కార్యాలు చేసి భార్య గుండెలో గూడు కట్టుకుంటాడు నువ్వెప్పుడయినా చేశావా అని?"

వాదనలో లొంగిపోయినట్టున్న కంఠంతో రాగనిధి అన్నాడు । " అద్భుత కార్యాలంటే ఏంటి - బూజుదులపటమా?"

" ఏం ఎందుక్కాకూడదూ ? ... పోనీ ఇప్పుడొద్దులే. మరి , మరి.. ఏంటంటే.. ఆగు," గడ్డం మీద వేలేసుకునికనురెప్పలు టపటపా ఆడించింది సుందరి. గబగబా వెళ్ళి హెయిర్ ఆయిల్ సీసా, గుప్పెడు గోరు చిక్కుడు కాయలూ పళ్లెమూ తెచ్చింది. తను కింద కూర్చుంది. అంది- " ఇదిగో చూడూ! నువ్విట్లా వచ్చి ఇక్కడ స్టూలు మీద కూర్చో నా తలకు నూనె రాయి. జడవెయ్యి . జడ వేయించుకుంటూ ఈ కాయలు ఒలుచుకుంటాన్నేను "

బాధగా బేలగా అన్నాడు రాగనిధి- " చాతకాదు. ఎప్పుడూ ఏ ఆడపిల్లకి జడ వెయ్యలేదు" ఆమె గుడ్లురిమి చూసింది 'చాతకాదూ .. పర్వాలేదు. వచ్చినట్లు వెయ్యి!"

అతను నీరసంగా కూలబడ్డాడు. ఆమె తలకు నూనె రాశాడు. వచ్చీరాని జడేదో వేస్తున్నాడు. అంతా అయిపోయే సమయానికి పిలుపూ పేరంటమూ లేకుండా వచ్చిన కూరల మనిషి భళ్ళున తలుపు తోసి " కూరలు కావాలా, అమ్మా!" అంటూ తొంగి చూసి ఆ దృశ్యం కంటబడగానే తెల్లబోయి వెంటనే కొంగు నోటి కడ్డం పెట్టుకుని పకపకా నవ్వసాగింది.

చివాల్న లేచి పోయాడు రాగనిధి. వాకిట్లో గదిలో కెళ్ళిపోయాడు కోపంగా. సుందరి కూరల మనిషిని పంపించేసింది. అతని దగ్గరకొచ్చి అంది. " అద్భుత కార్యాలంటే ఇట్లాంటివి! గుండెలో గుచ్చుకుపోయేవి. గుండెతో మాత్రమే కొలవగలిగే కొలత లున్నవి. ఈ మనిషి నాకు లేకపోతే, నాకు జీవితంలో త్రిల్లే లేదు. అనిపించేట్టు చేసేవి." అతను పేలవంగా చూశాడు. " నేనెప్పుడయినా నీ మాట కాదన్నానే చిట్టీ!"

"చస్.. కాదనకపోవటం కాదు. అవుననేది చేసి చూపించు. లేకపోతేనా..." ..."లేకపోతే?"

" ఏవుంది. వదిలెయ్యటమే" అవాక్కయిపోయాడు రాగనిధి. శూన్యంలోకి చూస్తూండిపోయాడు. క్రమంగా అతని కళ్లల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. " ఒదిలేస్తావా... నిజంగా!" అని ఎట్లాగో అన్నాడు.

★ ★ ★

రెండ్రోజులబట్టీ సుందరికి ఒంట్లో నలతగా ఉంటూంది. మొదటి రోజు ఎట్లాగో ఆఫీసుకి వెళ్ళొచ్చింది కానీ రెండో రోజు సెలవు పెట్టేసింది. రాగనిధి ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ వస్తూ మందు బిళ్ళలు తెచ్చిపెట్టాడు. వాటికి సుందరి నలత తగ్గలేదు. రాత్రి కామె పడకేసింది. వో రాత్రి వేళ ఆమె భర్తను లేపింది.

" ఏమండీ.. ఏమండీ.. నాకు నిద్ర పట్టటం లేదండీ, నాకేమిటో పిచ్చిగా ఉందండీ.. ఏం తోచట్లేదు.. ఇట్లా దగ్గరకొచ్చి కూర్చుందురూ! " రాగనిధి వెళ్ళి ఆమె నానుకుని కూర్చున్నాడు. కొంచెం సేపయ్యాక అడిగాడు. " పోనీ హోమియో మందిస్తాను చెప్పు. కాళ్ళు నొప్పులున్నాయా?" ... " అం"... "పొత్తి కడుపు నొప్పిగా ఉందా?" .. "అఁ". అదేపనిగా బాత్ రూమ్‌కెళ్ళొస్తున్నట్లున్నావు?" "అవును." ... " త్రేనుపులొస్తున్నాయా?" ... " అఁ" ... " అవులింతలు కూడా?". " అహఁ" ... " రైట్, ఇప్పుడు నీ తక్షణావసరం ఒక డోసు మేగ్‌పాస్ త్రీ ఎక్స్!" ... " మరండీ, హఠాత్తుగా ఎడం చెయ్యి చచ్చుపడి నట్టుగా ఉందండీ." ... " ఐసీ! అయితే కాలీఫాస్ వేసుకో" ... " తల నొప్పిగా కూడా ఉన్నట్లనిపిస్తూందేవిటో మరి!" ... " ఫెర్రంఫాస్‌తో కలిపిస్తాన్లే, వర్రీ అవకు". తను లేవబోయాడు ... " అసలు మీ దగ్గర ఎన్ని ఫాసులున్నాయేంటండీ?" ... " ఎన్నా. రోజూ చూట్టంలా? పన్నెండు. ద్వాదశ లవణాలంటారు. మళ్ళీ వాటిల్లో పొటెన్సీలు!" ... " ఏమీ అనుకోకండీ, మరి.. మీ మందు పని చేస్తుందంటారా.. మరి మొన్న దుర్గావి పిల్లాడికి విరేచనాలు కట్టలేదే?"

" మోతాదు విరేచనాలని చెప్పింది. పిల్లాడికి దంతాలొస్తున్నాయని చెప్పలేదు. ఆ విషయం

నా కింద్దాకనే తెలిసింది ఈ స్థితిలో కాల్కేరియా ఫాస్ అమృతంలాగా పని చేస్తుంది "

" నాకా ఫాస్‌లూ పడవ్, ఫీస్‌లు పడవ్ కాస్త నా వెన్ను రాయండి " రాగనిధి ఆమె వెన్ను రాయసాగాడు హఠాత్తుగా ఆమె లేచి బాత్‌రూమ్ కెళ్ళొచ్చింది ముసిముసిగా నవ్వుతూ - " మూడు రోజులు సెలవు" అంది రాగనిధి చిరాకు పడ్డాడు. " నీకు తెలిసిన విషయమే కదా- ఈ మాత్రానికే నన్నింత కంగారు పెట్టావెందుకు?" సుందరి మొహంలో కోపం తొంగి చూసింది. " ఏంటీ నాక్కష్టం వస్తే మీకు కంగారు కాదన్నమాట! నా కందుకే మిమ్మల్ని చూస్తే మంట. నిన్ను కట్టుకున్నా ఒకటే నీ కట్టెను కట్టుకున్నా ఒకటే. ఛీ, ఛీ!"

తెల్లబోయాడు రాగనిధి. " నేనే మన్నానని ఇన్నిన్ని అంటున్నావ్?" . " ఇంకేమనాలి! నీ ఇష్టం వచ్చినట్టు నువ్వు మాట్లాడితే నాఇష్టం వచ్చినట్టు నేనూ చెయ్యగల్ను గుర్తుంచుకో!"

" అంటే.. ఒదిలెయ్యటమా?"

" ఆ ఒదిలెయ్యటమే. అప్పీల్లేకుండా! స్టాంపు కాగితమ్మీద రాసిచ్చి మరీ చేస్తాను. నా సంగతి నీ కింకా తెలీదు "

నిలువు గుడ్లు పడిపోయాయి రాగనిధికి!

" నాకు మతి పోతూంది. ఎంత ప్రేమగా నేను నిన్ను చూసుకుంటున్నానో అంతగానూ నువ్వు నన్ను కసిరి కొడుతున్నావు. విదిలించేస్తున్నావు. ఒక్కనాడూ కారణం చెప్పవు ఇది నీకేం బాగుంది. చెప్పు? " బతిమాలుతూన్న ధోరణిలో అన్నాడు. రాగనిధి.

" కారణమా? మీరు మగవారవ్వటమే కారణం నాకు మొగుడవ్వటమే కారణం.. ఏ మగాణ్ణి . చివరకు కొడుకుని కూడా నమ్మకూడదన్నది ఈనాటి నీతి సూత్రం. దీనికి తగ్గట్టు ఈ మధ్య నాకో కలొచ్చింది తెలుసా?... మీరు మీ ఆఫీసులో లేడీ టైపిస్టును బీరువాల చాటుకు తీసికెళ్ళి ముద్దు పెట్టుకున్నార్ట!"

రాగనిధిలో చిరాకు తొంగి చూసింది. " స్టాప్ దట్ నాన్సెన్స్! .. నువ్వొట్టి అనుమానం మనిషివి. ఆ అనుమానాలే నీ కల్లోకొచ్చాయి. నీ గురించి నాకెప్పుడూ అట్లాంటి ఆలోచన్లు లేవు, కలలురావు." సుందరి గొంతు హెచ్చింది, " రావు? ఛస్తే నమ్మను ప్రతి మగాడూ ఒక స్కాండ్రల్లేనన్నది అంతర్జాతీయ సత్యం! మీరు ఆ జాతిలో వారే కదా!" ... " అగు ప్రతి మగాడూ అనకు. చాలా మంది మగాళ్లు అను.. కానీ చూశావూ! చాలా మంది ఆడాళ్ళూ డబుల్ స్కాండ్రల్స్! ఎందుకంటావా! మగాణ్ణి స్కాండ్రల్ చేసేది ఆడదే కాబట్టి! లేకపోతే కూడా వస్తున్నది కొడుకైనా కూడా లక్ష్యం లేకుండా ఆ లోనెక్ జాకెట్లు, బ్రాలూ వీధిలో కెందుకట వేసుకెళ్ళటం? ఒళ్ళు కప్పుకొని నడవటం మానేసి, కొంగు సగం దిగజార్చుకొని నడుస్తున్నారు ఏం లాభంకోసమో కాస్త చెబుతావా? అసలు ముఖ్య మైన విషయం! ఎవడన్నా తమ పట్ల పోకిరీ పని చేసినప్పుడు ఆ పని పది మందిలో జరిగినా సరే- ఎదురు తిరక్కుండా పట్టీ పట్టనట్టు దాటుకొని పోతారెందుకని? కాబట్టి..."

" అంటే నేను డబుల్ స్కాండ్రల్ నంటారు మీరు మాత్రం ఉత్తములంటారు?" ..." ఎవరి విషయమూ ప్రత్యేకించి చెప్పలేదు నేను " " ప్రత్యేకంగా చెప్పేదేమిటి చెప్పు. చేంతాడున్నూ! ఏదో మీరూ మగాళ్ళేగా అంటే దానికింత రాద్ధాంతమా! మోకాలికీ బట్టతలకీ ముడి పెట్టి నేను చెడిందాన్ననీ, మీరు నీతిమంతులనీ ఋజువు పరచటమా! మాట వరసకి వోమాట అన్నందుకే నన్నింతలేసి మాటలన్నారే! ,చేత వరసలకి బయట మీరుఏమేం వెలగబెడుతున్నారో! ఇహ లాభం లేదు తొందర్లోనే ఆ కాస్తా

ఎప్పటోప్పుడు తప్పదు'' కోపంగా అంది సుందరి.

రాగనిధి గొంతులో వూపు పెరిగింది.'' నిన్ను అనలేదు. నీ మీద నాకెంతో గౌరవమూ విశ్వాసమూ అసలు నా అంతరాంతరాల్లో నిన్ను ఆరాధిస్తున్నాను. కానీ, నువ్వు మాత్రం ఉత్త పుణ్యానికి నా మీదికి ఒంటి కాలిమీద లేస్తున్నావు. ఒదిలేస్తా ఒదిలేస్తాననటం పూత పదమైపోయింది. ఛీ,ఛీ!''

'' ఏమయ్యోయ్, చెప్పినట్లుగా నువ్వు చేస్తున్నట్లయితే మంచిదే. తన మొగుడు తన్ని ఆరాధించాలని ఏ ఆడది కోరుకోదు? కానీ ప్రతి విషయంలోనూ ఎడ్డెమంటే తెడ్డెమంటావ్? ఒదిలేయక నిన్నేం చేసుకోమంటావ్? అట్లా చూస్తావేంటి.. ఒట్టు సరస్వత్తోడు ! '' సుందరి టేబిల్ మీది న్యూస్ పేపర్ టక్కున తీసి నెత్తిన పెట్టుకుంది. ఆ వెంటనే '' అనుకున్నానంటే, ఇట్లా వదిలెయ్యటం ఖాయం!'' అంటూ ఆ పేపర్ను నేలమీద పడేసింది.

పమిట కొంగు నోట్లో కుక్కుకుని వచ్చే నవ్వును ఆపుకుంటూ వంటింట్లోకి పరుగెత్తింది సుందరి. విచారం మొహం నిండా అలుముకోగా రాగనిధి పడగ్గదిలో కెళ్ళి ముసుగు పెట్టి పడుకున్నాడు.

★ ★ ★

పుట్టింట్లో తన తల్లి దండ్రులకు టైఫాయిడ్ వచ్చిందని ఉత్తరం రాగానే సుందరి సెలవు పెట్టి వెళ్ళింది. అక్కడే వాళ్ళందరికీ సేవచేసి వాళ్ళకి తగ్గిందనుకునేసరికి తను మంచాన పడింది. ఆ విషయం తెలిసి రాగనిధి రాత్రననక, పగలనక భార్యకి సేవ చేశాడు. కళ్ళల్లో వత్తులు వేసుకుని ఆమె మంచం పక్క కాపలా కాశాడు. సుందరి తాలూకు వాళ్ళ నెవర్నీ ఆ మంచం చాయల కూడా రానివ్వలేదు. ఈ చాకిరీ వల్ల అతను చిక్కి సగమయ్యాడు. ప్రాణాలు కళ్ళల్లో కొచ్చాయి.

జ్వరం వెనక బెట్టింతరవాత కళ్ళు తెరిచి పక్కనే కూర్చునున్న భర్తను చూసి నొచ్చుకొంటూ అంది. '' ఏమండీ! మీ చేత చేయించుకుంటున్నానా, ఏమిటో!''... '' అదేమిటి, నా కొస్తే నేను చేసుకోనా? నాకూ, నీకూ భేదమేమిటి? నీకున్న ఓర్పు నాకెక్కుడుంది? ఆర్థికంగా ఎంతో చితికిపోయిన నీ తల్లి తండ్రులికి నువ్వు సంపాదించి పెట్టబట్టే కదా వాళ్ళు పుంజుకున్నారు. నీ అక్కలకు పెళ్ళిళ్ళు చెయ్యగలిగారు! ఇది మామూలు విషయమా! ఎంత గొప్ప త్యాగం! నీలో ఉన్న ఈ లక్షణమే నన్ను ముగ్ధుణ్ణి చేసింది. నిన్ను చేసుకుంటే నా పిల్లలకు కూడా ఈ వారసత్వమే వస్తుంది కదా అని ఆశపడ్డాను. అందుకనే నీ గుణాలను గురించి వాళ్ళనీ వీళ్ళనీ విచారించే నాకై నేనుగా వచ్చి నీ మెళ్ళో తాళి కట్టాను. నీలో ఉన్న సేవాభావం ముందు నాదెంత?''

అంత నీరసంలోనూ సుందరి కళ్ళు మెరిశాయి. ఆశ్చర్యంగా ఆమె అంది. ''నిజంగా? మీరు .. నన్ను నా గుణాలను చూసే చేసుకున్నారా. నేనసలు మా పెద్దవాళ్ళ కోసం మిమ్మల్ని చేసుకున్నాను. లోకంలో చూస్తూన్నాము- పెద్ద కట్నాలు తీసుకునికూడా భర్తలు భార్యల్ని రాచి రంపాన పెడుతున్నారు. మీ రసలు తీసుకోలేదు. అందుకనే మిమ్మల్ని నమ్మకూడ దనుకున్నాను. మీ త్యాగం గురించి చెప్పుకుంటూ బతికున్నంత కాలం నన్ను దెప్పుతుంటారేమోనని భయపడ్డాను. ఇంకా నా సంపాదన అంతా తెచ్చి మీ చేతుల్లో పోసి మీ మీద ఆధారపడి బతకమంటారేమోనని అనుకున్నాను. ఇవన్నీ నిజం కావా?''

'' కావు. ఒట్టిఅనుమానాలు మాత్రమే. స్త్రీని, స్త్రీ ధనాన్ని బలవంతంగా అనుభవించాలనుకోవటం కన్నా దౌర్భాగ్యం మరొకటిలేదు మగాడికి నేనసలు...'' ... '' ఆగండి. మరి నేను అందగత్తెను కాను గదా.'' రాగనిధి ప్రేమగా ఆమె ముంగురులు నిమిరాడు. ' పిచ్చిగా మాట్లాడకు. నీగుణాలసారమే. నీ అనురాగమే నీ అందం. అదే నాక్కావలసింది. ఇవాళుండి రేపు మళ్ళీ పోయే శరీరం అందం మీద నాకు

కథా నిలయం
3539
శ్రీకాకుళం



మోజులేదు"

సుందరి అవాక్కయింది. అతని మొహంలోకి తీక్షణంగా చూసింది. చూసి చూసి అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ డగ్గుత్తికతో అంది. "ఏవండీ! నిజంగానా? అయ్యో మన పెళ్ళయిన ఈ ఏడాది నుంచీ నేను ఎంత పొరపాటు చేశాను. మీరు నన్ను అవమానిస్తారేమోనని నేనే ముందు మిమ్మల్ని అవమానించాను. అఫెన్స్ ఈజ్ ఏ ఫారమ్ ఆఫ్ డిఫెన్స్ కదా. పాపిష్టిదాన్ని మీ మనస్సు ఎంత గాయపరిచానో మిమ్మల్ని ఎంత క్షోభ పెట్టానో అన్నట్టు మీకు జీతం కట్టేకదా నేనివ్వకపోగా మీ రాబడి పోగొట్టాను. దవుర్భాగ్యురాల్ని. ఛీ.ఛీ! నా పాపానికి నిష్కృతి లేదు. ఇట్లా మీ చేతుల్లో నేను గుటుక్కుమంటే ఎంత బాగుండును. అయ్యో. అయ్యో. నా పుట్టింట్లో మీ చేత బెడ్‌పాన్ పెట్టించుకున్నానా?" సుందరి ఉన్న కాస్త ఓపికతోనూ సన్నగా ఏడవటం మొదలు పెట్టింది.

రాగనిధి హఠాత్తుగా ఆమెను మంచం మీంచి ఎత్తి దించి, తన ఒళ్ళో కూర్చో బెట్టుకున్నాడు. ఆమె మొహమంతా ముద్దులతో నింపేశాడు. అన్నాడు. "పాపమూ కాదూ తాపమూ కాదు. ఏదో శాపం! ఆ శాపం ఈ వేళ్టితో తీనిపోయింది. మనం ఒకళ్ళ నొకళ్ళం ఇప్పటికైనా సరిగ్గా అర్థం చేసుకున్నాం. అంతేచాలు. మన సంసారం ఇవాళ్టినుంచే మొదలైనట్టు. మరింక చావు మాట ఎత్తకు. చివరి కాలంలో మరణం మనిద్దరికీ ఒకేసారి రావాలన్నది నా కోరిక తెలుసా?"

బలహీనంగా ఉన్న ఆ పూచిక పుల్లల్లాంటి చేతులతోనే భర్తను గాఢంగా కౌగలించుకుని వలవలా ఏడ్చేసింది సుందరి.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 15-12-82)

* * *     * * *     * * *

# కృష్ణా-జయంతి-కోణార్క కథ

తన ప్రాణ స్నేహితుడి పెళ్ళి కొచ్చిన సౌభాగ్యరావు, ఆ పెళ్ళి అయిపోగానే తనిహ బయల్దేరతానన్నాడు. ఆ ప్రాణస్నేహితుడు, 'రేపు మధ్యాహ్నం భోంచేసి కోణార్కకి వెడుదుగాన్లే. ఏలూరెళ్ళటం ఎంతసేపు? ఇవ్వాళ్టికి ఆగిపో" అన్నాడు.

"కనీసం పొద్దున్నే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కన్నా వెళ్ళనీ. నా సెలవులన్నీ నీ పెళ్ళి దెబ్బతో అయిపోయాయి తెల్సా" అన్నాడు సౌభాగ్యరావు. అరిచాడు. జుట్టుపీక్కున్నాడు. అయినా ఆ స్నేహితుడు తన మాటే చెల్లాలని కూర్చున్నాడు.

మౌనం పాటించాడు సౌభాగ్యరావు. మర్నాడు పొద్దున్న తెల్లారకుండానే మూడోకంటి వాడి క్కూడా తెలీకుండా పెళ్ళి పందిట్లోంచి అమాంతం ఆటోలోకి ఆపైన సికింద్రాబాద్ స్టేషన్లోకి వచ్చి పడ్డాడు.

అప్పుడే కృష్ణా ఎక్స్‌ప్రెస్ కూతేసింది. బయల్దేరింది కూడా. హడావుడిగా ఎట్లాగో టికెట్ తెచ్చుకుని,